క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత



పెనమలూరు: పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థులకు పోరంకి శివసతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందజేశారు. పోరంకిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ, వైఎస్సార్ సీపీ నేత బొర్రా కృష్ణ విద్యార్థులు బండి చందు, కనిగరపు నాగసాయి ప్రభుకుమార్‌లకు ఆర్థిక సాయం అందించారు. భవిష్యత్తులో తమ ట్రస్టు నుంచి పేద విద్యార్థులను ఆర్థికంగా సాయం చేసి ఆదుకుంటామని ట్రస్టు చైర్మన్ బొర్రా కృష్ణ తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



గన్నవరం: వరద బాధితుల సహాయార్థం గన్నవరానికి చెందిన టీజీవీఎస్ ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం ద్వారా రూ. 1 లక్ష విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇచ్చింది. ఈ మేరకు విజయవాడ కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం సీఎం చంద్రబాబు నాయుడుకు విరాళం చెక్కును అసోసియేషన్ కార్యవర్గం అందజేసింది. వరద బాధితులకు తమవంతు సాయంగా విరాళం ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యేలినేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యదర్శి బొబ్బా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి ఎంవీఎల్ ప్రసాద్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేయడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పటమట రామలింగేశ్వరనగర్‌కు చెందిన ఎం.అర్జున్‌రావు వినాయక చవితి పండుగకు మామిడాకులు తీసుకురావడానికి మనుమడు తనుష్‌తో కలిసి యనమలకుదురు సాయినగర్‌లో ఉన్న వరుసకు కుమార్తె అయిన సుధారాణి ఇంటికి శుక్రవారం వెళ్లాడు. ఆమె ఇంట్లో మామిడాకులు కోస్తుండగా అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న నాంచారయ్య అనే వ్యక్తి గొడవపడి అర్జున్‌రావుపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన అర్జునరావును పటమట ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. వీరవల్లి ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌కు అందిన పక్కా సమాచారంతో శనివారం రాత్రి ధర్మవరపు శివపార్వతి ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ. 13,700 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్లు, ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. చట్టవ్యతిరేకంగా జూద శిబిరాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బాపులపాడు మండలం వీరవల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శనివారం రాత్రి బోల్తా పడింది. రాజమహేంద్రవరం నుంచి బెంగుళూరు వెళ్తున్న బస్సు వీరవల్లి షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో బస్సు బోల్తా పడి దానిలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులు, డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలు అయ్యాయి. రోడ్డుపై బస్సు బోల్తా కొట్టడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. వీరవల్లి పోలీసులు రంగప్రవేశం చేసి ట్రాఫిక్‌ను సరిచేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తి అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు తాడిగడప డొంక రోడ్డు మాచిన వెంకటేశ్వరరావు రోడ్డులో ఇమ్మిడిశెట్టి రాధాకృష్ణ ఉంటున్నాడు. అతను కార్ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. కాగా వరద బాధితులకు ఆహారం అందించడం కోసం రాధాకృష్ణ కార్ టావెల్స్‌లో పని చేస్తున్న సురేష్, నాయక్, మరికొందరితో కలిసి ఈనెల 3వ తేదీన కంద్రిగ, పాయకాపురానికి వెళ్లాడు. అయితే రాధాకృష్ణతో వెళ్లిన వారు అందరూ తిరిగి ఇంటికి రాగా అతను మాత్రం రాలేదు. రాధాకృష్ణ ఆహారం పంచడానికి ఒక్కడే వేరే ప్రాంతానికి వెళ్లాడని అతనితో వెళ్లిన వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో అతని కుమారుడు సూర్యసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దండాలయ్యా... ఉండ్రాళ్లయ్యా...

ఘనంగా వినాయక చవితి వేడుకలు



పోరంకిలో గణేషుడికి పూజలు చేసిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దావాజీగూడెంలోని శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భగవన్నామ సంకీర్తన జరిగింది. తొలిరోజు భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. గన్నవరంలోని రాయ్‌నగర్, సుబ్బారావునగర్, గొడపేట, కొత్తపేట, కేసరపల్లి, బుద్ద వరం, దావాజీగూడెం అల్లాపురంలో గణపతి మహోత్సవాలు జరుగుతున్నాయి.


పెనమలూరు: మండల పరిధిలో వినాయక చవితి పండుగ శనివారం ఘనంగా జరిగింది. పందిళ్లలో కొలువుతీరిన వినాయకుడి విగ్రహాల వద్ద పసుపు, కుంకుమ, అక్షింతలు, దూపదీపాలు, చలివిడి, వడపప్పు, అటుకులు, పానకం, ఉండ్రాళ్లు, కుడుములు, పాలతాలికలు, పులహోర, గారెలు, పూర్ణాలు, పండ్లు, పూలు, పంచామృతాలు, 21 రకాల పత్రితో ప్రత్యేక పూజలు చేశారు.

దేవభక్తుని పూజలు

కాగా వినాయక చవితి సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రత్యేక పూజలు చేశారు. పోరంకిలో శివసతి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వినాయకుడి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా కనకదర్గ, బొర్రా కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కానూరు రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కూడా నేతలు సైకం చిన్నబాబు, వల్లభనేని మణికంఠతో కలిసి ఆయన పాల్గొన్నారు. కానూరు శ్రీతిరుపతమ్మ ఆలయంలో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేశారు. కానూరు, పెనమలూరు, యనమలకుదురు, పోరంకి గ్రామాల్లో చవితి ఉత్సవాలు సందడిగా జరుగుతున్నాయి.

విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నున్న గ్రామం చెరువు సెంటర్లో హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన వినాయకుని విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. హైస్కూల్ సెంటర్ రంగా బొమ్మ, కోటకట్ట సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. జగనన్న కాలనీ, లోయబాట సెంటర్, బోడపాడు గ్రామాల్లో భక్తులు చవితి వేడుకలు నిర్వహించారు. ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రం చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి చినకంచిలో చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతపాడు, విలేజి కండ్రిక, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో భక్తులు వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

కంకిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వినాయక చవితిని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆయా వినాయకుడి మండపాల వద్ద విశేష పూజా కార్యక్రమాలు, భజనలు జరిగాయి. ఈడుపుగల్లు బీసీ కాలనీలో ఆ కాలనీ యువత ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి మందిరాన్ని మాజీ ఎంపీపీ దేవినేని రాజా, పలువురు భక్తులు సందర్శించి స్వామివారికి పూజలు చేయించి, ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో వినాయక చవితి ఉత్సవాలు స్థానిక ధ్యాన యోగ సాయి మందిరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గాయత్రీవిహార్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి.పుష్పవతి, అసోసియేషన్ ప్రతినిధులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.



దావాజీగూడెం రామాలయంలో కొలువైన గణనాథుడు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో శనివారం వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. నిడమానూరులోని వరసిద్ధి వినాయక ఆలయంతోపాటు రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయం, ప్రసాదంపాడు బాబా ఆలయం, ఎనికేపాడు శివాలయాలను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పందిళ్లలో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉయ్యూరు: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉయ్యూరు చింతలతోటలోని గణనాథుడికి సీఐ రామారావు, ఎస్ఐ విశ్వనాథ్, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) ప్రత్యేక పూజలు చేశారు. బస్టాండు సెంటరులో దాసాంజనేయ వినాయక ఉత్సవ కమిటీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. గ్రామాల్లో చవితి సందడి నెలకొంది.



నున్నలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



ఈడుపుగల్లు బీసీ కాలనీలో..



ఉయ్యూరు చింతలతోటలోని గణనాథుడికి పూజలు చేస్తున్న సీఐ రామారావు

గరికపాటి సేవలు మరువలేనివి

పెనమలూరు: ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజాకళాకారుడు కళాతపస్వి డాక్టర్ గరికపాటి రాజారావు సేవలు మరువలేనివని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనీల్‌కుమార్ అన్నారు. పోరంకిలో ఆదివారం గరికపాటి రాజారావు 61వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రగతి కోసం అనే లక్ష్యంతో కళారూపాలతో ప్రజలను చైతన్య పరిచిన వ్యక్తి గరికపాటి రాజారావు అని అన్నారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి తన జీవితకాలం ఎనలేని కృషి చేశారని అన్నారు. నేటి యువత గరికపాటి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి షేక్ కాశిం, నేతలు అనుమోలు ప్రభాకరరావు, నారిన వెంకట్రావు, ఉప్పాడ త్రిమూర్తి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కంకిపాడు: భారీ వర్షాలు, వరదలతో ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ వరదల వల్ల రెండు తెలుగు రాష్ట్రాలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 5 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం, గాయపడ్డ వారికి రూ. 2.50 లక్షలు అందించాలని కోరారు.

ఉప్పొంగుతున్న బుడమేరు

- నీట మునిగిన పంట పొలాలు
- జలాశయాలుగా మారిన రహదారులు
- ఇళ్లచుట్టూ చేరిన వరదనీరు

కంకిపాడు: బుడమేరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చిచేరుతున్న వరద, భారీ వర్షాలతో ఉగ్రరూపం దాల్చింది. బుడమేరు తగ్గినట్టే తగ్గి మళ్లీ పొంగి పరవళ్లుతొక్కుతోంది. రహదారుల మీదుగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పంటపొలాలు నీటమునిగాయి. ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో జనం బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం బుడమేరు మరింత ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ముంపు ప్రభావం తీవ్రంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఉప్పలూరు, తెన్నేరు, మంతెన గ్రామాలపై ముంపు ప్రభావం ఎక్కువగా ఉంది. గంట గంటకూ ఉధృతి పెరుగుతుండటంతో ముంపు భయంతో అక్కడి ప్రజలు వణికిపోతున్నారు.

రాకపోకలు బంద్

బుడమేరు వరదతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కంకిపాడు-గన్నవరం రోడ్డు మీదుగా ఉప్పలూరు వద్ద బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రైల్వే ట్రాక్ దిగువ కట్ట వరకూ నీరు చేరింది. ఉధృతి మొదలైన నాటి నుంచే ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. రైల్వే ట్రాక్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి రాకపోకలు నిషేదిస్తూ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. తెన్నేరు ప్రధాన గ్రామంలోని రైతులు, ప్రజలు బుడమేరు వంతెనవద్దకు వెళ్లకుండా రహదారులపై ముళ్లకంచెలువేసి రాకపోకలపై నిషేధాజ్ఞలు విధించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పాఠశాలలకు సెలవు

వరద ముంపు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ-1 బీవీ శేషగిరిరావు, ఎంఈఓ-2 కేఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెన్నేరు జెడ్పీ, ఎంపీయూపీ ఉప్పలూరు, ఎంపీపీఎస్ మంతెన, ఎంపీపీఎస్ తెన్నేరు, ఎంపీయూపీ మారేడుమాక, ఆర్‌సీఎం ఉప్పలూరు, సెయింట్ ఆన్స్ ఉప్పలూరు, చరితశ్రీ (ప్రైవేటు) తెన్నేరు పాఠశాలలకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. మిగిలిన పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయన్నారు.

నున్న(విజయవాడరూరల్): బుడమేరు వరద కారణంగా నున్న-నూజివీడు రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. ఆదివారం కూడా ఈ రోడ్డులో మూడు అడుగుల బుడమేరు వరద ప్రవహిస్తుండటంతో ట్రాక్టర్ల పైనే అతి కష్టం మీద పాయకాపురం, పైపులరోడ్డు వరకు ప్రయాణం సాగిస్తున్నారు. కొందరు ట్రాక్టర్ల యజమానులు బాధితులను, ప్రయాణికుల అవసరాన్ని బట్టి మనిషికి 50 నుంచి 100, సామాన్లు ఉంటే వాటికి ప్రత్యేక చార్జి చొప్పున వసూలు చేస్తున్నారు.

ఏటిపాయకు మళ్లీ వరద

కంకిపాడు: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రకాశం బ్యారేజీకి వరదనీరు భారీగా చేరుతోంది. దీంతో అధికారులు బ్యారేజీ నుంచి 4.40 లక్షలు క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. ఫలితంగా కృష్ణానది ఏటిపాయ వరదనీటితో ఉగ్రరూపం దాల్చుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడి ప్రవహిస్తున్న ఏటిపాయ ఆదివారం వరదనీటితో నిండిపోయింది. కాసరనేనివారిపాలెం వద్ద ఏటి ఒడ్డున ఉన్న శివాలయం అంచులు తాకుతూ నీరు ప్రవహిస్తోంది. వరద తగ్గడంతో రెండు రోజుల క్రితం ఏటిపాయ లోపలకు మత్స్యకారులు పడవలను చేర్చారు. ఒక్కసారిగా చేరిన వరదనీటితో పడవలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. పడవల్లో భద్రపర్చిన వలలు వరదలో కొట్టుకుపోయాయని మత్స్యకారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే వరద నీరు పొలాలను వదలడం లేదు. దీనికి తోడు కురుస్తున్న వర్షానికి పొలాల్లో నీరు చేరుతోంది. వరదనీటిని తొలగించేందుకు సన్నాహాలు చేసుకుంటుండగా వర్షాలు సమస్యను జఠిలం చేస్తుండటంతో అన్నదాతల కష్టం వర్ణనాతీతంగా ఉంది. మరోవైపు రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. కంకిపాడు బస్టాండు, రైతుబజారు ప్రాంతాలతో పాటుగా ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, గొడవర్రు గ్రామాల్లోని జగనన్న లే అవుట్‌ల్లో అంతర్గత రహదారులు జలమయంగా మారడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం, సావరగూడెం గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. ముస్తాబాద గ్రామం వైపు వరదనీరు కొద్దిగా తగ్గడంతో సావరగూడెం గ్రామస్తులు నిత్యావసరాల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. కొత్తగూడెం వద్ద ఆదివారం చీమలవాగు ప్రవాహం పెరగడంతో చిక్కవరం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

పెనమలూరు: మండల పరిధిలో కృష్ణానదికి వరద ఆదివారం పెరిగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు దిగువకు వదలడంతో నదిలో మరల ప్రవాహం పెరగసాగింది. గతవారం కృష్ణానదికి దాదాపు 13 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చి కరకట్ట దిగువున ఉన్న కాలనీలు, పంటలను పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి. వరద తగ్గడంతో ఊపిరి పీల్చుకున్న నివాసితుల్లో మరల కృష్ణానదికి వరద పెరుగుతుండటంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉంగుటూరు: మడలంలో బుడమేరు, వన్నేరు వాగుల వరద ప్రవాహం తగ్గినప్పటికీ ఇంకా వెల్దిపాడు, కొయ్యగూరపాడు గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. తహసీల్దార్ విమల కుమారి, డీటీ శ్రీలత, ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓఆర్డీ అమీర్ బాషా ఆయా గ్రామాలను పర్యవేక్షిస్తున్నారు.



నున్న-నూజివీడు రోడ్డుపై వరద నీటి ప్రవాహం

ఇంకా జలదిగ్బంధంలోనే గ్రామాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరద ఉధృతితో బాపులపాడు మండలంలోని ఆరు గ్రామాలు గతవారం రోజులుగా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. 216హెచ్ జాతీయ రహదారిపై ఆరుగొలను - పుట్టగుంట గ్రామాల మధ్య సుమారు నాలుగు అడుగల మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో హనుమాన్ జంక్షన్- గుడివాడ మధ్య రాకపోకలు పూర్తిగా నిల్చిపోయారు. రెవిన్యూ, పోలీసు యంత్రాంగం ఆరుగొలను వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిలు ఆరుగొలను వద్ద బుడమేరు వరద ఉధృతిని ఆదివారం సాయంత్రం పరిశీలించారు. బాపులపాడు, కానుమోలు, ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం, రంగయ్య అప్పారావుపేటలో ఎనిమిది పునరావాస కేంద్రాల్లో దాదాపు 1,800 మంది నిర్వాసితులు ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు వీరవల్లిలో పెద్ద చెరువులు పూర్తిస్థాయిలో వరద నీరు చేరుకోవడంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని ఆయా గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు.



బాపులపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు భోజనం పెడుతున్న దాతలు



పెదపులిపాక వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణానది



ఉంగుటూరులో బుడమేరు ప్రవాహం



ఉప్పలూరు వద్ద రాకపోకలు నిషేదిస్తూ బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ డి.సందీప్, సిబ్బంది



తెన్నేరు జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో నిలిచిన వరద నీరు



మద్దూరు వద్ద ఒడ్డుకు కొట్టుకువచ్చిన పడవలు

వరద బాధితులకు ఆపన్న హస్తం

కంకిపాడు: వరద బాధిత కుటుంబాలకు పలువురు ఆపన్న హస్తం అందించారు. వరద ముంపు ప్రాంతాలకు వెళ్లి తమ వంతు సాయంగా ఆహారాన్ని పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని మారేడుమాక గ్రామానికి చెందిన సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, ఆయన మిత్రబృందం వేమండ ప్రభుదాసు, కొడాలి అఖిల్, వేమండ పాల్ బాధితులకు భోజనాలు అందించారు. అలాగే పటమట అభ్యుదయ జూనియర్ కాలేజ్ 2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సింగ్‌నగర్ పైపులరోడ్డు ప్రాంతంలోని బాధితులకు ఆదివారం భోజనాలను అందించారు. యు.నాగేశ్వరరావు, ఏ.దుర్గాప్రసాద్, ఎస్.శ్రీరాములు, ఎండీ గయాస్, పి.రమాదేవి, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ నాయకులు యర్కారెడ్డి మల్లారెడ్డి(బుజ్జి), సునీత దంపతులు ఆదివారం నున్న జెడ్పీ హైస్కూల్‌లోని 31 మంది వరద బాధితులకు భోజనాలు, దుస్తులు పంపిణీ చేశారు. గత రెండు రోజులుగా మల్లారెడ్డి రాజీవ్‌నగర్‌లోని వరద బాధితులకు ట్రాక్టర్‌పై భోజనాలు, తాగునీరు అందజేశారు. అలాగే నున్న గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని సాంబిరెడ్డి దంపతులు ఆదివారం నున్న జెడ్పీ హైస్కూల్లోని వరద బాధితులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో..

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద రైల్వే కాలనీలో వరద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకుడు జీవీఆర్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి రైల్వే కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు గమనించి 63 కుటుంబాలకు బియ్యం, కూరగాయలతో ఉన్న కిట్లు పంపిణీ చేశారు. ఆపదలో తనవంతు సాయంగా గ్రామస్తులకు కిట్లు అందజేసినట్లు జీవీఆర్ చెప్పారు. విజయ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



నున్నలో బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న యర్కారెడ్డి సునీత



ముస్తాబాదలో నిత్యావసరాల కిట్లు అందజేస్తున్న జీవీఆర్, నాయకులు

పేద విద్యార్థినికి 'మానవత' ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద విద్యార్థినికి ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. స్థానిక ఏలూరురోడ్డుకు చెందిన బీఎస్సీ విద్యార్థిని కేఎస్వీ పార్వతి కుటుంబం ఆర్థిక సమస్యలతో కాలేజీ ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో వారు మానవత సంస్థను ఆశ్రయించడంతో దాతలు వెంటనే స్పందించి రూ. 40,116 ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించారు. మానవత కార్యాలయంలో ఈ మొత్తాన్ని దాతలు, మానవత సభ్యులు విద్యార్థినికి అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన చదువు అర్ధాంతరంగా ఆగిపోతుందని ఎంతో ఆందోళన చెందానని, కాలేజీ ఫీజుకు డబ్బు చెల్లించిన మానవత సభ్యులకు రుణపడి ఉంటానని విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపింది. మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, సభ్యులు గంటా సత్యనారాయణ, గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, ఇందిరాదేవి, వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, పాట్లూరి శేషాచలం, రేవిణిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ఉంగుటూరు: స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని తహసీల్దార్ విమలకుమారి, ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. క్రాస్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం ఎలుకపాడులో నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 300 మందికి స్నాక్స్ అందజేశారు. ఈవోపీఆర్డీ అమీర్ బాషా, ట్రస్ట్ డైరెక్టర్ ఖదేశ్‌బాబు, డాక్టర్లు ఝాన్సీలక్ష్మి, సౌమ్య, గ్రామ సర్పంచ్ పోలిమెట్ల శ్రీరామ్, మాజీ సర్పంచ్ మున్నంగి నిరీక్షణరావు, కార్యదర్శి నర్రా ప్రసాద్ పాల్గొన్నారు.